తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు



భీమడోలు వరి క్షేత్రంలో దుబ్బు తెగులును జిల్లా వ్యవసాయాధికారికి చూపుతున్న రైతులు



భీమడోలులో రైతులు సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

భీమడోలు: తెగుళ్ల నివారణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి డా. వై.రామకృష్ణ అన్నారు. ఏలూరు జిల్లా స్థాయిలో 72 మంది రైతులకు చెందిన 250 ఏకరాల విస్తీర్ణంలో క్లస్టర్ పొలంబడికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన భీమడోలులోని సామూహిక వరి క్షేత్రాన్ని ఏడీఏ పి.ఉషారాజకుమారితో కలిసి ఆయన గురు వారం పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి రైతు అవతారమెత్తి పొలం గట్లపై వరి క్షేత్రాలన్నీ కలియ తిరిగారు. మిత్ర, శత్రు పురుగులను పరిశీలించి రైతులకు పలు సూచనలందించారు. జింకు లోపం, కాండం తొలుచు పురుగు, కాండం కుళ్లు తెగులు, ఆకు ముడత తెగుళ్లను గుర్తించి ఆయన రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులను వివరించి వాటి నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది వాటిని నివారణపై యాజమాన్య పద్ధతులను వివరిస్తారని, వారి సూచనలను పాటించాలన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతులు ఎకరా పంటను సాగు చేసేందుకు 15 నుంచి 25వేల వరకు పెట్టుబడి ఖర్చులు పెడుతున్నారన్నారు. వచ్చే ఆదాయం తక్కువగా వస్తున్నందున రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వ్యవసాయ శాఖ ద్వారా జిల్లా స్థాయిలో భీమడోలులో పొలంబడిలో దాళ్వా సీజన్‌లో క్లస్టర్ పొలంబడి కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దాళ్వా సీజన్‌లో 30నుంచి 40వారాల పాటు పొలంబడి నిర్వహించాల్సి ఉండగా ఇప్పటివరకు ఆరు వారాల్లో పొలం బడి కార్యక్రమం పూర్తి చేసామన్నారు. పురుగుమందులు, ఎరువులను తగ్గించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

పెదపాడు: ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పెదపాడు మండల తహసీల్దార్ జీ విజయ్‌కుమార్‌రాజు అధికారులను ఆదేశించారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడు గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక గ్రామ స్థాయి అధికారులకు సూచనలు సలహాలు అందించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఎవరైతే స్లాబులు వేసారో వారిని పూర్తి చేసేలా చూడాలన్నారు. ఇంకా ప్రారంభించని వారు ఉంటే పునాదులు వేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో అజయ్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కె. కన్నాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నేడు పెదవేగి మండలం కె కన్నాపురంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ కేశన సతీష్ చెప్పారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ శుక్రవారం కె కన్నాపురం పంచాయతీలో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధ్యక్షతన జరుగుతుందని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని సతీష్ కోరారు.

క్లుప్తంగా

మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



గోదావరి కాల్వ వద్ద పంపింగ్ స్కీమ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ

దెందులూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. గురువారం దెందులూరు గోదావరికాల్వ పంపింగ్ స్కీమ్ చెరువులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. మంచినీటి నాణ్యత, సరఫరా, మరమ్మతులు, చెరువుల్లో నీరు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి గ్రామంలోనూ మంచినీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక ప్రణాళిక ద్వారా సకాలంలో చర్యలు తీసుకుని జవాబుదారీ సేవలందిస్తామన్నారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ వేమూరిజితేంద్ర, డివిజనల్ ఇంజనీర్ రమేష్, దెందులూరు ఎఈ ఏ.రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు.

పరీక్షలు తనిఖీ చేసిన ఎంఈఓ



ఎఫ్ఎ-3 పరీక్షలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ బుద్దావ్యాస్

దెందులూరు: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఎఫ్ఎ-3 పరీక్షలను మండల విద్యాశాఖాధికారి సీహెచ్ బుద్దా వ్యాస్ తనిఖీచేశారు. విద్యార్థుల హాజరు శాతంను హెచ్ఎం పీవీ రామశర్మను అడిగి తెలుసుకున్నారు. 9,10,11 తేదిల్లో ఒకటవ తరగతి నుంచి 10 తరగతి విద్యార్థులకు ఎఫ్ఎ-3(అర్ధ సంవత్సర) పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

వేదకుమారికి ఎమ్మెల్యేల సత్కారం



వేదకుమారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు అబ్బయ్యచౌదరి, వెంకట్రావు

దెందులూరు: విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారిని గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, తలారి వెంకట్రావులు వేదకుమారిని ఘనంగా సత్కరించారు. అమ్మవారి సేవలు, ఆధ్యాత్మిక సేవలకు కృషి చేయాలన్నారు. సత్కరించిన వారిలో వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, తొత్తడి కృష్ణ తదితరులున్నారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: స్పందన వినతులను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో దెందులూరు మండలం నుంచి వివిధ గ్రామాల ప్రజలు, వివిధ సమస్యలపై చెప్పి వినతులను అందజేశారు. పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే పంపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, నాయకులు గొరిపర్తి రంగారావు, రాము తదితరులు ఉన్నారు.

రావుల చెరువు వేలం నిలుపుదల

వారం రోజులు స్టే ఇచ్చిన హైకోర్టు



పెదకడిమి గ్రామంలోని రావుల చెరువు

పెదవేగి : మండలం పెదకడిమి పంచాయతీ రావుల చెరువు వేలం పాట వారం రోజులు నిలుపుదల చేస్తూ హైకోర్టు స్టే ఇచ్చిందని దాసాంజనేయ రజక సంఘ అధ్యక్షుడు సకలాపురపు చిట్టిబాబు తెలిపారు. ఈ చెరువు పై రజకులకు పంచాయతీకి మధ్య వేలం విషయంపై వివాదం ఏర్పడి హై కోర్టు వరకు వెళ్లారు. చెరువుకు వేలం పాట పెడితే పంచాయతీ ఆదాయం పెరుగుతుందని పంచాయతీ పాలక వర్గం కోర్ట్ కు వెళ్లింది. 1978లో ప్రభుత్వం 343 జీఓ ప్రకారం రజకులకు వృత్తి నిర్వహణకు చెరువు కేటాయించారు. కొన్నేళ్లుగా తాతలు, తండ్రులు రావుల చేరువులోనే వృత్తి నిర్వహిస్తున్నారని ఈ చెరువులో ప్రభుత్వం దోబీ ఘాట్లు కూడా నిర్మించిందని కోరుతూ రజకులు కూడా హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఇటీవల హైకోర్టు పంచాయతీ పాలక వర్గానికి అనుకూలంగా రావుల చెరువుకు వేలం నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చింది.హైకోర్టు ఉత్తర్వులను పంచాయతీ అధికారులు అమలు చేయలేదు. దీనిపై సంబంధిత అధికారులపై కోర్ట్ ధిక్కరణ చర్యలు చేపట్టాల్సిన సమయంలో జిల్లా అధికారులు కలెక్టర్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పడి హైకోర్టు ఆదేశాలను అమలు పరిచేందుకు నిర్ణయించి ఫిబ్రవరి 9 వ తేదీన పెదకడిమి పంచాయతీలో రావుల చెరువుకు వేలం నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఈలోగా హైకోర్టు పెదకడిమిలో రావుల చెరువు వేలంను ఒక వారం రోజులు వాయిదా వేస్తూ స్టే ఇచ్చింది. దీంతో 9వ తేదీన గురువారం జరగాల్సిన రావుల చెరువు వేలం వారం రోజుల పాటు ఆగింది.

మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం

ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి యువత ముందుకు రావాలని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై స్థానిక సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు గురువారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మేలుకో, భవితను మలచుకో, డ్రగ్స్ వదులుకో అనే నినాదంతో కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలో అవగాహన కల్పిస్తున్నామని, ముఖ్యమైన ప్రదేశాల్లో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఒకసారి డ్రగ్స్‌కి అలవాటయితే జీవితాన్ని అధఃపాతాళానికి తీసుకువెళతాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్ ఫోన్ 83329 59175కు, జిల్లా వాట్స్ యాప్ నెంబర్ 95503 51100కు మెసేజ్ చేయవచ్చని, ఎస్ఈబీ టోల్ ఫ్రీ నెంబర్ 14500కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు మాట్లాడారు. విద్యార్థులతో మాదకద్రవ్యాలు వినియోగించమని మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రచారం చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ కేవీ రావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.రవి కుమార్, అసిస్టెంట్ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అమర బాబు, ఏలూరు త్రి టౌన్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణధన్ రాజు, ఏలూరు ఎస్ఈబీ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి, ఏలూరు 3 టౌన్ ఎస్ఐ శంకర్, పోలీస్, ఎస్ఈబీ సిబ్బంది, పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

గంజాయి రవాణాపై పటిష్టమైన నిఘా



ఏలూరు రైల్వేస్టేషన్‌లో గంజాయి రవాణాపై కూలీలకు సూచనలిస్తున్న అధికారులు

ఏలూరు టౌన్: గంజాయి రవాణాపై రైల్వే పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. విజయవాడ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్, సివిల్ పోలీసులు, జీఆర్‌పీ సిబ్బంది బుధవారం ఏలూరులోని రైల్వే స్టేషన్ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. హమాలీలు, సరుకు రవాణా చేసే సంస్థలు, ఇతర సిబ్బందికి గంజాయి రవాణా, బాలికల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ కె.సాయినాథ్, ఆర్‌పీఎఫ్ పోస్ట్ కమాండర్ బి.శంకరరావు, జీఆర్‌పీ ఎస్సై డి.నరసింహారావు, ఏఎస్ఐ పి.సైమన్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం నుంచీ విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లను, పార్శిల్ కార్యాలయం, అనుమానితుల లగేజీను రైల్వే పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఐ సాయినాథ్ మాట్లాడుతూ రైల్వే శాఖ రైళ్లు, పార్శిల్ సర్వీసుల్లో గంజాయి రవాణా జరగకుండా నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. గంజాయి, బాలికల అక్రమ రవాణాపై విజయవాడ రైల్వే సీఐ సాయినాథ్ సెల్ నెంబర్ 94406 27545, ఆర్‌పీఎఫ్ కమాండర్ శంకరరావు 97013 73723, జీఆర్‌పీ ఎస్సై నరసింహారావు 94406 27527కు, డయిల్ 100, రైల్వే హెల్ప్ లైన్ 139, జీఆర్‌పీ హెల్ప్‌లైన్ 1512కు ఫోన్ చేసి తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

హమాలీల చార్జీలు ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి

ఉంగుటూరు: హమాలీల చార్జీలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఉంగుటూరు మండలంలో జరిగిన ఖరీఫ్ సీజన్‌లో 49,850 మెట్రిక్‌టన్నులు ధాన్యం రైతులు ఎగుమతి చేశారు. క్వింటాలుకు 25రూపాయలు, 40కేజీల బస్తాకు 10రూపాయలు చొప్పున రైతుకు చెల్లించాల్సి ఉంది. 1కోటి 25లక్షలు రూపాయలు సుమారుగా 8400 మంది రైతులకు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వమైతే ఈ మెత్తం విడుదల చేసినట్లు సమాచారం. సహకార వ్యవస్థ ద్వారా అందాల్సిన ఈడబ్బులు ఇంకా రాలేదు. దాంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై స్థానిక సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జిని ప్రశ్నించగా గత దాళ్వాసీజనులో హమాలీలు ఛార్జీలు సగం వచ్చాయని, , వాటిని త్వరలో రైతులుకు అందజేస్తామని తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



హరికథాగానం చేస్తున్న ముదపాక బాల సుందరం భాగవతార్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రామకోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపానలు, హరేరామ సంకీర్తనలు ఆలపించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు నిత్య హోమం, స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. తొలుత నగరానికి చెందిన బీకే బిందు అన్నమాచార్య కీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు. తాడేపల్లిగూడెంకు చెందిన ముదపాక బాల సుందరం భాగవతార్ విరాట్ పర్వం అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. తొలుత అర్చకులు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రజల అవస్థలు తీర్చాలన్నదే లక్ష్యం



జానంపేట-ఏడవ మైలురాయి రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : రహదారుల రూపురేఖలు మార్చి ప్రయాణికుల అవస్థలు తీర్చాలన్న లక్ష్యంగా కృషి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం జానంపేట నుంచి కొప్పులవారిగూడెం మీదుగా 7వ మైలురాయి వరకు నూతనంగా వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించి పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణంలో తప్పకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఉంగుటూరు: నారాయణపురం గ్రామానికి చెందిన వివాహిత రాజమండ్రిలోని అమ్మగారి ఇంటికి వెళతానని చెప్పడంతో భర్త ఈనెల 6 వతేదీన నారాయణపురం సెంటర్లో బస్సు ఎక్కించారు. కాని ఆమె రాజమండ్రి చేరలేదు. ఆచూకి తెలియలేదు. ఆనాటి నుంచి ఈ రోజు వరకు వెతికి భర్త చేబ్రోలు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై స్వామి తెలిపారు.